స్కూల్ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..?



స్లాబ్ లెవల్‌లో నిలిచిపోయిన స్కూల్ భవనం

- స్లాబ్ లెవల్‌లో నిలిచిపోయిన భవనం
- ఇబ్బందులు పడుతున్న పార్థివ్‌వాడ విద్యార్థులు

ఫతేనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ పార్థివ్‌వాడ ప్రభుత్వ స్కూల్ విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. పక్కా భవనాన్ని నిర్మిస్తామని చెప్పి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్ ఆదేశాలతో తాత్కాలికంగా స్కూలును స్థానికంగా ఉన్న కమ్యూనిటీహాలులోకి అక్టోబర్ 2022లో మార్చారు. ఏడాదిన్నర పూర్తయినప్పటికీ స్కూల్ భవనం నిర్మాణం పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. స్కూల్ భవనం అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కమ్యూనిటీ హాలులో చదువుకుంటున్న 114 మంది విద్యార్థులు

భవనం నిర్మాణం కోసం రూ.45 లక్షలు

పార్థివ్‌వాడలో శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల భవనం అనే శీర్షికతో జూన్ 2022న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురించింది. వార్తతో స్పందించిన ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు. నూతన భవన నిర్మాణం కోసం ఎస్టిమేషన్ తయారు చేయించారు. రూ.45 లక్షల నిధులు మంజూరు చేయించి శిథిలావస్థలో ఉన్న స్కూలు భవనాన్ని కూల్చివేసి కొత్త బిల్డింగ్ పనులు మొదలు పెట్టారు. కానీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు భవన నిర్మాణం పనులు ముమ్మరంగా సాగాయి. వచ్చే అకడమిక్ ఇయర్‌లోగా కొత్త స్కూల్ భవనం సిద్ధమవుతుందని విద్యార్థులు సంతోషించారు. కానీ నిధులు లేవని స్కూల్ భవనం పనులు స్లాబ్ వరకు చేసి ఆపేశారు. ఈ విద్యా సంవత్సరం కొత్త స్కూల్ భవనంలోకి వెళతామని ఆశపడిన విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆశలు ఆవిరైపోయాయి.

ఒకే హాలులో 114 మంది విద్యార్థులు

స్కూలు భవనం నుంచి కమ్యూనిటీ హాలులోకి మార్చినప్పటికీ విద్యార్థులను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. కమ్యూనిటీ హాలు చదువుకునేందుకు వీలుగా లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఒకటి నుంచి 5 వరకు 114 మంది విద్యార్థులకు ఒకే హాలు ఉండడంతో బోధన సరిగ్గా సాగడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాల విద్యార్థులు, టీచర్లకు సరిపడా మూత్రశాలలు, తాగునీటి సదుపాయాలు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం

స్కూలు నిర్మాణం కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నిధుల నుంచి సేకరించిన రూ.45 లక్షలతో స్లాబ్ వర్క్ పూర్తి చేశాం. మిగతా పనులకు సుమారు రూ. 35-40 లక్షల నిధులు కావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నియోజకవర్గానికి రావాల్సిన నిధులు మంజూరు కాగానే పనులు మొదలు పెడతాం.

- పవన్, డివిజన్ ఏఈ

వచ్చే విద్యా సంవత్సరానికైనా పూర్తి చేయండి



మా బిడ్డలకు మంచి చదువులు చదివించాలని ఆశపడ్డాం. కానీ చదువు సంగతి దేవుడెరుగు. స్కూలు భవనం సరిగ్గా లేకపోవడం బాధగా ఉంది. కొత్త భవనంలో స్కూలు చక్కగా సాగుతుందనుకుంటే పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వచ్చే విద్యా సంవత్సరానికి భవన నిర్మాణం పూర్తి చేయాలి.

- సునయన, పార్థివ్‌వాడ

ప్రజావాణికి 42 ఫిర్యాదులు

కూకట్‌పల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మూసాపేటలోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయ పరిధిలోని ఐదు సర్కిళ్ల నుంచి 42 ఫిర్యాదులు అందాయి. మూసాపేట సర్కిల్ నుంచి 2, కూకట్‌పల్లి నుంచి 1, కుత్బుల్లాపూర్ 4, గాజులరామారం 4, అల్వాల్ 3, జోనల్ కార్యాలయానికి సంబంధించినవి 28 చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. రోడ్లు, టౌన్‌ప్లానింగ్, పారిశుధ్యం, పార్కులకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా అందాయి. జోనల్ కార్యాలయానికి సంబంధించిన ఫిర్యాదుదారులతో జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ మాట్లాడి సమస్యలు తెలుసుకొన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించి అందుకు సంబంధించిన నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్, మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్ల అధికారులు పాల్గొన్నారు.

భూకబ్జాలు, అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోండి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

నిజాంపేట్: నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో సోమవారం భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రగతినగర్ ఎర్రకుంట చెరువు మ్యాప్స్ కన్‌స్ట్రక్షన్, బాచుపల్లి పెద్దచెరువు నాలా 454 సర్వేనెంబరులో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని, కేజీఆర్ కన్వెన్షన్‌లో నాలా, రోడ్డు ఆక్రమణ, ఎస్వీఆర్ కాలేజీ, స్కూల్ నందు సర్వేనెంబరు 186 ప్రభుత్వ భూమి, యూఎల్‌సీ భూమిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో బీజేపీ ఎన్ఎంసీ యూనిట్ సభ్యులు ఫిర్యాదు చేశారు.



మాట్లాడుతున్న పట్నం సునీతారెడ్డి

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

మియాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలందరూ సైనికుల్లా పని చేయాలని వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్, కాంగ్రెస్ నాయకురాలు పట్నం సునీతారెడ్డి అన్నారు. కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ నాయకులు మహిపాల్‌యాదవ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని, నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నల్ల సంజీవరెడ్డి, వీరందర్‌గౌడ్, షరీఫ్, మన్నేపల్లి సాంబశివరావు, సాజిద్, మునఫ్‌ఖాన్, రషీద్, నజీర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్, పక్కన బీజేపీ నాయకులు

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం: ఈటల రాజేందర్

కూకట్‌పల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మూసాపేటలో సోమవారం నిర్వహించిన గుజరాతీ సమాజ్ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశంలో గణనీయమైన అభివృద్ధిని సాధించిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మూడోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందన్నారు. తెలంగాణలో బీజేపీకి అత్యధిక ఎంపీ సీట్లు అందిస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే బాధ్యత బీజేపీ తీసుకొంటుదన్నారు. కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా బీజేపీకి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కార్పొరేటర్ మహేందర్, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసం క్రీడలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న పున్నారెడ్డి

షాపూర్‌నగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): క్రీడలు ఆరోగ్యానికి, స్నేహభావానికి దోహదం చేస్తాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి తెలిపారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్‌లోని వీనస్ రాక్‌హైట్స్ వీనస్ ప్రెసిడెంట్ వేమారెడ్డి, ఆర్గనైజర్స్ హరీష్, క్రాంతి మిత్రబృందం ఏర్పాటు చేసిన మార్వెల్ స్పోర్ట్స్ క్లబ్ బాక్స్ క్రికెట్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌రెడ్డి వారి మిత్ర బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ

మహిళలు స్వశక్తితో ముందుకు సాగాలి

షాపూర్‌నగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్ విశ్వకర్మ కాలనీలో సోమవారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ పాల్గొని మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించడం దేశ, రాష్ట్ర ప్రగతికి సోపానం అన్నారు. మహిళలు స్వశక్తితో సాధికారత దిశగా అడుగులు వేయాలన్నారు. స్త్రీలు ఉద్యోగాలకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, రాజకీయంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

షాపూర్‌నగర్ పరిధిలో తాగునీటి సమస్య లేదు



షాపూర్‌నగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): షాపూర్‌నగర్ జలమండలి కార్యాలయం పరిధిలో ప్రస్తుతానికి తాగునీటి సమస్య లేదని జలమండలి డీజీఎం అప్పల నాయుడు తెలిపారు. గోదావరి జలాలు వచ్చిన తరువాత ఇప్పటి వరకు నీటి సమస్య తలెత్తలేదని తెలిపారు. వేసవి కాలం సమీపిస్తుండడంతో పలు ప్రాంతాల్లో నీటి సమస్య ఉందని, ప్రస్తుతానికి షాపూర్‌నగర్ పరిధిలో తాగునీటి సమస్య లేదన్నారు. ట్యాంకర్ల ద్వారా సప్లై చేసి నీరు కూడా తక్కువగానే ఉందని, ట్యాంకర్ బుక్ చేసుకుంటే రూ.5 వందలు చెల్లించాలి. బల్క్ సప్లై ఉన్న వారు ఒక్క ట్యాంకర్‌కి రూ. 8 వందలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రెండు రోజుల కొక సారి సమస్యలు లేని విధంగా నాణ్యమైన నీటిని ప్రజలకు అందిస్తున్నాం.

- పడిపూజ



గాజులరామారం డివిజన్ నల్లగుట్ట భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో జరిగిన 23వ మహాశివ పడిపూజ కార్యక్రమానికి సోమవారం తెలంగాణ ఎన్‌యూఎస్ఐ జనరల్ సెక్రటరీ గొల్ల జాన్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దూదిమెట్ల సోమేష్ యాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. - షాపూర్‌నగర్

మీదికుంట చెరువు సుందరీకరణ షురూ



చెరువు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, జగదీశ్వర్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ పరిధిలోని మీదికుంట చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే సీడీపీ నిధులతో పార్ట్వ్యాన్ హెడ్ ది గ్లోబల్ స్కూల్ యాజమాన్యం, మాతృశ్రీనగర్ సంక్షేమ సంఘం భాగస్వామ్యంతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సీడీపీ నిధులు, ఫౌంటెన్‌హెడ్ ది గ్లోబల్‌స్కూల్ ఫౌండర్ అండ్ చైర్‌పర్సన్ మేఘన మసునూరి, కాలనీ అసోసియేషన్ సభ్యులు కలిసి చెరువు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు శ్రీధర్, లేక్ మాన్ ఆఫ్ ఇండియా ఆనంద్, చైతన్య, రాము, కల్పన, సుధా, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సాంబశివరావు, భిక్షపతిముదిరాజ్, కావూరి అనిల్, రఘునాథ్, సాంబయ్య, మామిడాల రాజు, రాజయ్య, గంట వాసు, విజయ్, రమేష్, సతీష్, అనిల్ పాల్గొన్నారు.

టెక్నికల్ వర్కర్లకు మంచి డిమాండ్

నీడ్స్ రిసోర్సెస్ ఆధ్వర్యంలో వరల్డ్ ప్లంబింగ్ డే సెలబ్రేషన్స్



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా టెక్నికల్ వర్కర్లకు మంచి డిమాండ్ ఉందని మాజీ క్రెడాయ్ అధ్యక్షుడు ఐజీబీసీ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ శేఖర్‌రెడ్డి అన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్, టీఎన్‌జీవో కాలనీలో ఏర్పాటు చేసిన వరల్డ్ ప్లంబింగ్ డే సెలబ్రేషన్స్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జర్మనీ లాంటి దేశాల్లో కూడా ప్లంబర్లకు లైసెన్స్‌లున్నాయని లైసెన్స్ లేని ఏ టెక్నీషియన్‌ను కూడా ఏ పని చేయ్యరని, వీరికే డిమాండ్ ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్లంబింగ్ డే చేసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి11 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి మండల పరిధిలో మంజూరైన 266 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ఆరెకపూడి గాంధీ కేపీహెచ్‌బీలోని తహసీల్దార్ కార్యాలయం లో సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. గతంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం ఇస్తే సంతోషిస్తామని ఎమ్మెల్యేలు అన్నా రు. ప్రజల పక్షానే తాము ఉంటామని, ప్రభుత్వం ఏదైనా అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వామి, కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, సబియా గౌసుద్దీన్, బాబురావు పాల్గొన్నారు.

ముగిసిన క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్



విజేతలతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

చందానగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చందానగర్ అంబేద్కర్ కల్యాణమండపంలో నిర్వహించిన 10వ తెలంగాణ రాష్ట్ర క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉప్పల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మలేషియా అంతర్జాతీయ శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ కల్చరల్ అసోసియేషన్ ఉగాది పురస్కారాలు అందజేస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు డా.మిరియాల జానకిరామ వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైజ్ఞానిక, విజ్ఞాన, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, సేవ, సినీ, క్రీడా రంగాల్లో నిష్ణాతులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మార్చి 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉగాదిని పురస్కరించుకుని మే 10న మలేషియాలోని కౌలాలంపూర్‌లో పురస్కారాలు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు 9666910480లో సంప్రదించాలని కోరారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



పట్టుబడ్డ నిందితులు

జీడిమెట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా నిల్వచేసి వాహనాల్లో తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి 460 కిలోల బియ్యం, ఒక వాహనం, తూకం కాంటాను స్వాధీనం చేసుకున్నారు. ఎల్లమ్మబండ ప్రాంతానికిచెందిన షేక్ అమీర్ (24),షేక్ హాజీ(27), సయ్యద్ ఫజీల్(41)లు తక్కువ ధరకు బియ్యం సేకరించి జహీరాబాద్ ప్రాంతానికిచెందిన విక్కీ అనేవ్యక్తికి విక్రయిస్తుంటారు. సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.

18 నుంచి ఓయూలో క్రికెట్ టోర్నమెంట్

తార్నాక, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఫ్) ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 20వరకు ఉస్మానియా యూనివర్సిటీలో భగత్‌సింగ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఏఐవైఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఏఐవైఫ్ విద్యార్థి నాయకులు టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను హబ్సిగూడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక భూమిక పోషించిన భగత్‌సింగ్‌ను స్మరిస్తూ ఈనెల 18, 19, 20న మూడు రోజులపాటు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునే యువకులు 9347279087 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ విద్యార్థి నాయకులు భరత్, కీర్తన్, ప్రదీప్, రాజు, హరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం కోసం బెంగళూరు వెళ్లిన యువకుడి అదృశ్యం

యుసుఫ్‌గూడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం కోసం బెంగళూరు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. రహ్మత్‌నగర్‌లో నివాసం ఉంటున్న టి.స్వరూపరాణి, టి.శ్రీనివాస్‌చంద్ర ప్రవేట్ ఉద్యోగి. వీరు గతంలో యాదగిరి నగర్‌లో నివాసం ఉండేవారు. మూడు నెలల క్రితం రహ్మత్‌నగర్‌కు వచ్చారు. వీరి కుమారుడు సుభాష్‌చంద్ర యాదగిరి నగర్‌లో ఉండే సమయంలో పంజాగుట్టలోని ఓ జ్యూవెలరీ షాప్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ మెరుగైన ఉద్యోగం కోసం బెంగళూరు వెళ్లాడు. తన స్నేహితుడితో కలిసి ఉంటూ ఉద్యోగం చేస్తున్నట్లు చెప్పాడు. ఇటీవల స్వరూపరాణి కుమారుడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో అతని స్నేహితుడు మణికంఠకు ఫోన్ చేయగా మీ అబ్బాయి బాగానే ఉన్నాడు... ఉద్యోగం చేసుకుంటున్నాడని, అతని ఫోన్ పగిలి పోయిందని చెప్పడమే కానీ.. ఫోన్‌లో మాట్లాడించడం లేదు. దీంతో స్వరూపరాణి మణికంఠ అతని భార్య స్వాతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




ప్రమాదంలో మంటలను ఆర్పుతున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది

కర్రీ పాయింట్‌లో అగ్నిప్రమాదం

- పేలిన గ్యాస్ సిలిండర్.. భయంతో జనం పరుగులు

ఖైరతాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఒక చిన్న కర్రీ పాయింట్. అందులో 4 గ్యాస్ సిలిండర్లు. మధ్యా హ్నం వంటలు వండుదామ ని గ్యాస్‌ను ఆన్ చేయగా దా ని పైపు నుంచి గ్యాస్ లీకై మంటలు అంటుకున్నాయి. క్షణాల్లో మంటలు ఎగిసిపడ డం, అందులోని గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో ఒక్కసారిగా ఖైరతాబాద్ మార్కెట్ చౌరస్తాలో భయానక వాతావరణం కనిపించింది. ఫైర్ ఇంజన్ వచ్చేవరకు పోలీసులు మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమించినా ఫైర్ శాఖ సిబ్బంది వచ్చేవరకు నిలువరించలేకపోయారు. వివరాల ప్రకారం... ఖైరతాబాద్ మార్కెట్ చౌరస్తాలో మహాలక్ష్మి కర్రీ పాయింట్ ఉంది. ఇందులో మధ్యాహ్న భోజనంతో పాటు కర్రీలు అమ్ముతుంటారు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో బ్రహ్మచారి అనే వ్యక్తి వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పైప్ లీక్ కావడంతో మంటలు వచ్చాయి. వాటిని అదుపుచేసేందుకు ప్రయత్నించినా సాధ్యపడకపోవడంతో అతడు బయటకు పరుగులు తీశాడు. ఇంతలోనే మంటలు ఎగిసిపడి గ్యాస్ సిలిండర్ పేలింది. ఆసమయంలో భారీ శబ్దంతో మంటలు బయటకు రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వారి ద్వారా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో అక్కడున్నకర్రీపాయింట్ నిర్వాహకుడు బ్రహ్మచారికి స్వల్ప గాయాలయ్యాయి. ఫైర్ ఇంజన్ వచ్చేవరకు పోలీసులు మంటలను ఆర్పేందుకు తీవ్రంగా కృషి చేశారు. కాగా చిన్న పాటి కర్రీ పాయింట్‌లో 4 గ్యాస్ సిలిండర్లు ఉంచడం, భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై నిర్వాహకులు బ్రహ్మచారి, ఓంప్రకాష్‌పై పోలీసులు కేసులు నమోదు చేశారు. గ్యాస్ సిలిండర్లను ఫైర్ సిబ్బంది బయటకు తెచ్చి వాటిని చల్లబరచడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న హన్మంత్‌రెడ్డి

రెండొందల మంది కాంగ్రెస్‌లో చేరిక

నిజాంపేట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గాంధీనగర్‌వాసులు ఎర్రోళ్ల విష్ణు వారి మిత్ర బృందం రెండు వందల మంది సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పని చేసే దిశగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎంసీ ప్రెసిడెంట్ కొలన్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

- అడ్డుకోబోయిన కానిస్టేబుల్‌పై దాడి



రాజుయాదవ్

హైదర్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు హోటల్ యజమానురాలితో పాటు అడ్డొచ్చిన పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి భాగ్యనగర్ కాలనీ అర్జున్ థియేటర్ సమీపంలోని సిరి టిఫిన్స్ సెంటర్ వద్దకు రాజుయాదవ్ అనే వ్యక్తి అతిగా మద్యం సేవించి టిఫిన్ కోసం వచ్చాడు. తనకు టిఫిన్ ఉచితంగా పెట్టాలని హోటల్ యజమాని కుమారిని డిమాండ్ చేశారు. అందుకు ఆమె నిరాకరించడంతో దుర్భాషలాడుతూ ఆమెపై హెల్మెట్‌తో దాడి చేశారు. స్థానికులు 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయడంతో అక్కడికి చేరుకున్న కానిస్టేబుల్ శశికాంత్‌రెడ్డి, రాజుయాదవ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేయ్యగా మత్తులో ఉన్న రాజుయాదవ్ కానిస్టేబుల్‌పై దాడిచేసి పిడిగుద్దులు కురిపించాడు. రాజుయాదవ్‌ను అడ్డుకున్న పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రైల్వే కోచ్ రెస్టారెంట్ జాతికి అంకితం

బర్కత్‌పుర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఆధునిక హంగులతో ఏర్పాటు చేసిన రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను ప్రధాని మోదీ మంగళవారం జాతికి అంకితం చేయనున్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్ పాత రిజర్వేషన్ కౌంటర్ వద్ద 2016లో రైల్వే స్టేషన్ శతాబ్ది వేడుకల సందర్భంగా ప్యాలెస్ ఆన్ వీల్స్ పేరిట రెండు బోగీలను రెస్టారెంట్‌గా ఏర్పాటు చేసినా ప్రారంభానికి నోచుకోలేదు. 2023లో ఈ బోగీలను రైల్వే అధికారులు పరివార్ గ్రూప్ సంస్థకు అప్పగించగా కోచ్ రెస్టారెంట్‌గా తీర్చిదిద్దారు. మంగళవారం ఉదయం 9.15 గంటలకు ప్రధాని మోదీ వర్చ్యువల్‌గా కోచ్ రెస్టారెంట్‌ను జాతికి అంకితం చేస్తారని కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ తెలిపారు. దీనిని ప్రధాని ప్రారంభించనున్నారు. కోచ్ రెస్టారెంట్, చేనేత స్టాల్ ప్రారంభమై 8 నెలలు కావస్తున్నప్పటికీ ప్రధాని మంగళవారం జాతికి అంకితం చేయడం కొసమెరుపు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అడ్డగుట్ట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రోరైల్ పిల్లర్ 1167 వద్ద గుర్తుతెలియని 40 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా, పెట్రోలింగ్ చేస్తున్న కానిస్టేబుల్ జగదీష్ ఘటనా స్థలికి చేరుకున్నాడు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ఇంటి భోజనంతో ఆరోగ్యం

సెలబ్రిటీ న్యూట్రీషియన్ రుజుతా దివేకర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రుజుతా దివేకర్, ఫ్లో సభ్యులు

హైదరాబాద్ సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతంలో దొరికే, సీజనల్ ఫుడ్స్‌తో పాటుగా మరీ ముఖ్యంగా ఇంటి భోజనం ఆరోగ్యానికి మంచిదని సెలబ్రిటీ న్యూట్రిషియన్ రుజుతా దివేకర్ అన్నారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) హైదరాబాద్ చాప్టర్ ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నలభై ఏళ్ల వయసు నుంచే ఆరోగ్య పరంగా గణనీయంగా మార్పులు చోటు చేసుకుంటాయని, ఈ వయసులో మహిళల కోసం 40+ మంత్ర వివరించారు. సరిగా తినకపోతే లేదంటే తినాల్సిన ఆహారం తినకపోతే పీరియడ్స్ సమస్యలు వచ్చే అవకాశాలున్నాయని ఆమె వివరించారు. ఆకుకూరలు, శెనగలు, పెసరపప్పు, అరటి పండ్లు లాంటి తాజా పండ్లు లాంటివి తీసుకోవాలని సూచించారు. మంచి నిద్ర సౌందర్యానికి ముఖ్యమని, ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరని ఆమె సూచించారు. నేటి జీవనశైలి ఆరోగ్య సమస్యలు, వాటికి కారణాలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఫ్లో హైదరాబాద్ చైర్ పర్సన్ రీతు షాతో పాటుగా పెద్ద సంఖ్యలో ఫ్లో సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
హరిబాబు : 9985411086, పున్నారావు: 9985921366